# యువ్వనుడా!

# ❤❤ఓ యౌవనుడా! ఎక్కడ తప్పిపోయావ్?❤❤

*కంప్యూటర్ యుగంలో జీవిస్తూ, ఆశల పల్లకిలోవిహరిస్తూ, ఫ్రెండ్స్ తో ఎంజాయ్ చేస్తూ, జీవిత యాత్రలో బుల్లెట్ లా దూసుకుపోతున్నావ్ కదూ? అయితే, దానికంటూ ఒక లక్ష్యం ఉందా? లక్ష్యం వైపే సాగిపోతున్నావా? లేక గురితప్పిందా? అది ఎక్కడ తప్పింది?*

*నీకంటూ ఒక లక్ష్యం లేదని నేను అనుకోను. లక్ష్యం లేక పరిగెత్తేవాడు పిచ్చోడు. నీవు అట్లా ఎంతమాత్రమూ కాదు. అయితే, నీ లక్ష్యం గురితప్పిందేమో? అన్నదే నా అనుమానం.*

*ఎందుకంటే? రంగుల ప్రపంచంలో పరుగులు తీస్తున్నాము. ప్రతీ రంగులోనూ పాపమే తారసపడింది. టెక్నాలజీ విపరీతంగా పెరిగిపోతుంది. పాపం మరింత దగ్గరై పోతుంది.*

*ఫోన్ (లాండ్ లైన్) వైర్లతో బంధించబడి ఉన్నంత సేపు మనిషి స్వేచగానే వున్నాడు. ఆ ఫోన్ ( సెల్ ఫోన్) కి స్వేచ్ఛ వచ్చేసరికి, మనిషి బంధీ అయిపోయాడు. అది లేకుండా టాయిలెట్ కి కూడా వెళ్లలేని స్థితి.*
*స్మార్ట్ ఫోన్స్ వచ్చి, మనిషిని పిచ్చోడిని చేసేశాయి. రాత్రింబగల్లు వాటితోనే కాలక్షేపం. చూడకూడనివి చూస్తూ పతనం అంచుల్లోకి చేరుకుంది యువత.*

*వీరిలో నీవూ వున్నావు కదా! నీ గురి తప్పిందని నీకు తెలుసు. అయినా, వాటినే వెంటాడుతున్నావు కదా? నీ ఆశలు తీర్చుకోవడానికి నీ కుటుంబం ఒక అడ్డుబండలా మారిందా? స్వేచ్ఛ కోసం ఆరాట పడుతున్నావా? ఏదో సాధించాలని గమ్యం తెలియని ప్రయాణం చేస్తున్నావా?*

నీవలెనే, ఒక యౌవనుడు ఇట్లానే ఆలోచించడం మొదలు పెట్టాడు. తండ్రి దగ్గర వుంటే? తనకి నచ్చినట్లు జీవించడం సాధ్యం కాదు అనుకున్నాడేమో? లేక, పట్టణం వెళ్లి వ్యాపారం చేసి కోట్లు గడించాలి అనుకున్నాడేమో? లేక, పట్టణంలో అనేకమంది అమ్మాయిలుంటారు. అక్కడ మనము ఎట్లా తిరిగినా పట్టించుకొనేవారు ఎవరూ వుండరు అనుకున్నాడేమో? అతని తలంపులే అతనిని చెప్పలేనంత ఆనందంతో నింపేసాయి. ఇక అది క్రియారూపం దాల్చితే? ఓహో! జీవితం అంటే అదే అనుకున్నాడు.

తండ్రి దగ్గర తన వాటా తీసుకొని సుదూర ప్రాంతం వెళ్లిపోయాడు. అంతా తాను అనుకున్నట్లుగానే జరుగుతుంది. అనేక మంది గర్ల్ ఫ్రెండ్స్, బాయ్ ఫ్రెండ్స్, విలాసవంతమైన జీవితం. జీవితం అంటే ఇదే. ఇంతకాలం మిస్ అయ్యాను. కాస్త ఆలస్యమైనా సరియైన నిర్ణయం తీసుకున్నాను అంటూ సంబరపడిపోతున్నాడు. అది ఎంత కాలం? కూర్చొని తింటే? కొండలైనా తరిగిపోతాయట. అదే జరిగింది. వేశ్యలతో కలసి తింటూవుంటే జేబులు ఖాళీ అయిపోయాయి. ఫ్రెండ్స్ అడ్రస్ లేకుండా పోయారు.

సమస్తాన్ని ఖర్చు చేసి, తినడానికి తిండి లేక, తాను బ్రతకడం కోసం ఉద్యోగ వేటలో పడ్డాడు. ఎట్టకేలకు ఉద్యోగం సంపాదించాడు. దానికి కావాల్సిన అర్హత 'గోచి' ఒక్కటి చాలు. ఒక జత బట్టకు కూడా అవసర్లేదు. సరిగ్గా అదే పరిస్థితిలో ఉన్నాడేమో? ఆకలి బాధ తాళలేక పందుల కాపరిగా చేరిపోయాడు.

పందుల పొట్టు చూచేసరికి ఆకలి రెట్టింపు అయ్యింది. యజమాని ఆహారం పెట్టేవరకు ఆకలి బాధను తట్టుకోలేక, పందుల పొట్టు తినబోయి, యజమానికి దొరికిపోయి, గెంటివేయ బడ్డాడు.
తాను చెయ్యాల్సిన ప్రయత్నాలన్నీ చేసేసాడు. కాని, అతని ప్రయత్నం ఒక్క పూట కూడా తన కడుపు నింపలేక పోయింది.
ఇక ఆలోచించడం మొదలుపెట్టాడు. ఈ పరిస్థితికి గల కారణమేమిటి? ⋆నేనెక్కడ తప్పిపోయాను?⋆ అంటూ ఆలోచిస్తుంటే, అతనికి అర్థమయ్యింది.

ఎక్కడ తప్పిపోయాడు?
తండ్రి ఇంట తప్పిపోయాడని.
తండ్రి కంటే ముందుగా దేవుని నుండి తప్పిపోయాడని.

పశ్చాత్తాపము కలిగిన హృదయంతో ఒక నిర్ణయానికి వచ్చాడు. నా తండ్రి ఇంట పనివారికి సహితం సమృద్ధియైన ఆహారముంది.
తిరిగి అక్కడికే వెళ్లి,

"తండ్రీ, నేను పరలోక మునకు విరోధముగాను నీ యెదుటను పాపము చేసితిని; ఇకమీదట నీ కుమారుడనని అనిపించుకొనుటకు యోగ్యుడనుకాను. నీ పనివారిలో ఒకరిగా నన్నుంచు". లూకా 15:21

అంటూ క్షమాపణ వేడాలి అనే నిర్ణయానికి వచ్చాడు. బయలు దేరాడు.

**బక్క చిక్కి, పిచ్చివాడిలా నడవలేక నడుస్తూ వస్తున్న కుమారుని దూరమునుండే తండ్రి గుర్తు పట్టేసాడు. పరిగెత్తు కెళ్ళి, మెడమీద పడి ముద్దు పెట్టుకొని, ఇంటికి తీసుకు వచ్చి, స్నానము చేయించి, క్రొత్త బట్టలు తొడిగించి, చేతికి ఉంగరము పెట్టి, పాదాలకు చెప్పలను తొడిగించి, క్రొవ్విన దూడను వధించి, విందు చేయించాడు.**

ప్రియ స్నేహితుడా!

* నీవెక్కడ తప్పిపోయావ్?

* నీవు కోరుకున్న స్వేచ్ఛ నిన్ను ఎక్కడకి నడిపించింది?

* నీ ఆశలు నిన్ను ఏ వ్యసనాలకు బానిసను చేసాయి?

ఒకవేళ లోకాన్ని అనుభవించడం కోసం దేవుని నుండి పారిపోయి, భ్రష్టమైన జీవితాన్ని జీవిస్తున్నావేమో? నీవు చెయ్యాల్సిన ప్రయత్నాలన్నీ చేసేసినా సమాధానం అంటూ నీ జీవితములో లేకుండా పోయిందేమో? దేవుడు కూడా నన్ను క్షమించడు, చేర్చుకోడు అనే నిర్ణయానికి వచ్చేసావేమో?

అయితే, ఆయన ఒక సార్వత్రికమైన పిలుపు నిస్తున్నాడు. దానిలో నీ పేరు కూడా వుంది. నిన్నే పిలుస్తున్నాడు.

ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగ జేతును. మత్తయి 11:28

అవును! నీ భారం ఏదైనా కావొచ్చు. అది ఎంతైనా కావొచ్చు. గంతించిన కాలంలో నీ జీవితం ఎట్లాంటిదైనా అయ్యుండొచ్చు.

**నిన్ను కని,పెంచిన తలిదండ్రులు కూడా నీ తప్పలను క్షమించలేకపోవచ్చు. నిన్ను చేర్చుకోకపోవచ్చు. అయితే, నిన్ను క్షమించేవాడు, నిన్ను చేర్చుకొనే వాడు, నిన్ను ప్రేమించేవాడు ఒకాయన వున్నాడు. ఆయన పేరే ప్రేమా స్వరూపి. ప్రేమించడం ఆయన లక్షణం. అందుకే ఆయన నీకోసం తన ప్రాణాన్ని సహితం పెట్టాడు. ఆయనే ప్రియ రక్షకుడైన యేసు క్రీస్తు.**

**విరిగినలిగిన హృదయంతో, పశ్చత్తాపముతో, ఆయన చెంతకు రాగలిగితే? ఆయన ఎంత మాత్రమూ త్రోసివేసే వాడు కాదు.**

ఆ చిన్న కుమారుడు క్షమాపణ అడగాలని నిర్ణయించు కున్నాడంతే. ఇంకా క్షమాపణ కూడా అడగనే లేదు. అప్పటికే తండ్రి ఎంతగా ప్రతిస్పందించాడో చూడండి.

**ఆ తండ్రి తన కుమారుని యొక్క అసహ్యమైన రూపాన్ని ఏమి పట్టించుకోలేదు. కౌగలించు కొని, మెడ మీద పడి ముద్దు పెట్టుకొంటున్నాడు.**

*మన తండ్రి కూడా అంతే. నీవు తిరిగి ఆయన చెంతకు వస్తే? నీ జీవితం ఎట్లాంటిదైనాసరే, నిన్ను తన కౌగిలి చేర్చుకొంటాడు.నీవు తిరిగి వస్తావని, చాచిన చేతులతో దినమెల్లా నీ కోసం ఎదురు చూస్తున్నాడు.*

*ఆ తండ్రి తొడిగించిన వస్త్రాలు రక్షణ, నీతి వస్త్రాలకు, ఉంగరం అధికారానికి, చెప్పలు కుమారుడు అని చెప్పటకు సాదృశ్యం.*

*(ఆ కాలంలో దాసులు చెప్పలు ధరించడానికి వీలులేదు. కుమారులు మాత్రమే చెక్కతో చేయబడిన చెప్పలు ధరించేవారు)*

*నీ తండ్రి కూడా నీకు కుమారత్వముతో పాటు నిత్య రాజ్యాన్ని నీకిస్తాడు. నీవు ఏ స్థితిలోనున్నా సరే, విడిచి పెట్టి, ప్రభువు చెంతకు చేరు.*

అట్టి కృప, ధన్యత

దేవుడు మనకు అనుగ్రహించునుగాక!

ఆమెన్! ఆమెన్! ఆమెన్

# ❤❤ఓ యౌవనుడా! నీ యౌవనబలాన్ని దేనికి బలి చేస్తున్నావ్?❤❤

సాతాను స్మార్ట్ ఫోనును మన చేతికిచ్చి, వాడు చాలా స్మార్ట్ గా వాడిపని వాడు చేసుకొని పోతున్నాడు. ఏదైనా సమాచారం కోసం ఇంటర్ నెట్ ఓపెన్ చేస్తే చాలు. click me, click me అంటూ అశ్లీల చిత్రాలు బ్లింక్ అవుతూనే ఉంటాయి. పొరపాటున టచ్ చేసామా? అంతే. ప్రమాదంలో పడినట్టే. అందుకే, నేటి దినాలలో జారత్వము, వ్యభిచారం, హోమో సెక్స్ ( పురుషుడు మరొక పురుషునితో చేసే లైంగిక పాపం), లెస్బినిజం ( స్త్రీ మరొక స్త్రీ తో కలసి చేసే లైంగిక పాపం) తారా స్థాయికి చేరాయి. ఇవి ఇప్పుడే ప్రారంభం కాలేదు గాని, నాటి నుండి సాతాను మనుష్యుల బలహీనతను ఉపయోగించుకోవడంలో సంపూర్తిగా సఫలమయ్యాడు. ఇప్పుడు మరింత ముందుకు దూసుకుపోతున్నాడు.

అనేక దేశాలలో హోమో సెక్స్, లెస్బినిజం చట్ట బద్ధమవుతుంది.

ఇష్టపడి చేస్తే, వ్యభిచారం తప్పేమి కాదంటూ న్యాయ స్థానాలు సహితం తీర్పులు వెల్లడిస్తున్నాయి.

ఈ తీర్పులతో సాతాను ఎగిరి గంతులు వేస్తూ, రెట్టించిన ఉత్సాహంతో మరింత విజృంభిస్తున్నాడు. వాడి వలలో ఇప్పటికే చిక్కావో? చిక్కడానికి సమీపంలో వున్నావో? నాకైతే తెలియదు గాని, సాతాను నీమీద సంపూర్ణమైన దృష్టి పెట్టి వుంచాడు అనే విషయం మాత్రం మరచి పోవద్దు.

జారస్త్రీయుండు ఛాయకు పోక నీ మార్గము దానికి దూరముగా చేసికొనుము దాని యింటివాకిటి దగ్గరకు వెళ్ల కుము. వెళ్లినయెడల పరులకు నీ యౌవనబలమును క్రూరులకు నీ జీవితకాలమును ఇచ్చివేతువు (సామెతలు 5:8,9)

వేశ్య లోతైన గొయ్యి పరస్త్రీ యిరుకైన గుంట. (సామెతలు 23:27) నీ బలమును స్త్రీలకియ్యకుము రాజులను నశింపజేయు స్త్రీలతో సహవాసము చేయకుము (సామెతలు 31:3).

కానీ, నీవు చెయ్యాల్సింది ఏమిటంటే? **నీ యౌవనకాలపు భార్యయందు సంతోషింపుము. ఆమె అతిప్రియమైన లేడి, అందమైన దుప్పి. (సామెతలు 5:18,19). ఇంకా వివాహం కాకపోతే, ఆ సమయం వచ్చేవరకు సాతాను వలలో చిక్కకుండా, నిన్ను నీవు కాపాడుకో. అంతేగాని, వ్యభిచరింప వద్దు. (మత్తయి 19:18).**

**పరిశుద్ధ గ్రంథం వ్యభిచారమనే పాపమును అన్ని పాపముల కంటే ఘోరమైన పాపముగా పేర్కొన్నది.**

కారణం? ఏ పాపమైనా ఒక్కరి వల్లనే జరుగుతుంది. కాని వ్యభిచారము మాత్రము ఒక వ్యక్తి పాపము చేస్తూ మరొకరిని పాపములోనికి లాగుతుంది. ఒక స్త్రీని మోహపుచూపుతో చూచు ప్రతివాడు అప్పడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును. (మత్తయి 5:28) ఒక పురుషుని మోహపుచూపుతో చూచు ప్రతిస్త్రీ అప్పడే తనహృదయమందు అతనితో వ్యభిచారము చేసినదగును.అంటే? చేసినా? చూచినా? రెండూ ఒక్కటేనా? కానే కాదు. చేసినదానికీ, చూచినదానికీ శిక్ష ఒక్కటేనా? కానే కాదు. మరెందుకిలా? మోహపు చూపుతో చూస్తే, అది హృదయంలో ముద్రించబడి, ఆతప్పచెయ్యడానికి శరీరాన్ని బలవంతం చెయ్యొచ్చు. అట్లాంటి చూపులే లేకపోతే? ఆ తప్పు చేసే అవకాశమే లేదు. అందుకే ఆయన వేళ్లతోసహా ఆ పాపమును పెకిలించి వెయ్యాలని అట్లా చెప్పారు. అంతేగాని, చేసిన వాడు, చూచినవాడు ఇద్దరూ ఒక్కటే అని మాత్రం తలంచకూడదు. చేసినవాడికి చేసినంత శిక్ష, చూచినవాడికి చూచినంత.

అయితే, నేటి దినాలలో, నూతనమైన, వక్రమైన బోధలు పుట్టుకొస్తున్నాయి. **కొందరు రహస్యముగా జొరబడియున్నారు. వారు భక్తిహీనులై మన దేవుని కృపను కామాతురత్వమునకు దుర్వినియోగ పరచు చున్నారు. (యూదా 1:4)**

**మన మంచి పనులు దేవుని రాజ్యం చేర్చలేవు. కేవలం ఆయన 'కృప' మాత్రమే నిత్య రాజ్యం చేర్చగలదు. కాబట్టి వ్యభిచారం చేసినా తప్పేమి కాదు. దానికి శిక్షేమి లేదంటూ, ఆయన కృప మనలను రక్షిస్తుంది. మంటి నుండి తీయబడిన శరీరం మన్నై పోతుంది. ఆత్మ మాత్రమే దేవుని యొద్దకు వెళ్తుంది. కాబట్టి, ఆత్మ పరిశుద్ధంగా వుంటే చాలు. నశించిపోయే శరీరానికి పరిశుద్ధత అవసరం లేదు. అనేది వీరి వక్ర బోధ. శరీరం మాలిన్యమైపోయాక, ఆత్మ ఎట్లా పరిశుద్ధంగా వుండగలుగు తుంది? అది సాధ్యం కానే కాదు.**

అందుకే పౌలు గారు ఈ రీతిగా మాట్లాడు తున్నారు. శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషము నుండి మనలను పవిత్రులనుగా చేసికొందము. (2కొరింథీ 7:1)

**దేవుని కృపకు కూడా కొన్ని పరిధులుంటాయి**. నేనెట్లా జీవించినా దేవుని కృప నన్ను రక్షిస్తుందిలే అనుకోవడం అవివేకం. తప్పు చేసినవాడు ఎంతటి వాడైనా, పశ్చాత్తాప పడకపోతే, శిక్ష అనుభవించ తీరవలసిందే. సంసోను (న్యాయాధిపతి), దావీదు (రాజు), హొఫ్నీ, ఫీనెహాసు (యాజకులు), సొదొమ గొమొఱ్ఱా ప్రజలు (సామాన్యులు).... ఇట్లా వారెంతటి వారైనా సరే, తప్పించుకోలేక పోయారు.

వ్యభిచారం ఎంతటి భయంకరమైన పరిస్థితి లోనికి నిన్ను నెట్టేస్తుందో ఒక యౌవనుని జీవితాన్ని నీ జ్ఞాపకంలోనికి తీసుకొని రావాలి అనుకొంటున్నాను.

ఆ యౌవనుడు దేవుని కోసం ప్రతిష్ట చేయబడిన వాడు. బైబిల్ గ్రంధములోనే అత్యంత బలవంతుడు. కొదమ సింహాన్ని సహితం అవలీలగా చీల్చివేసిన బలశాలి. 300 నక్కలను పట్టుకొని శత్రువుల పంట పొలాలను నాశనం చేసిన ధీరుడు.

పట్టణానికి కావలిగా నున్న ఇనుప గేటును సహితం ఊడబెరికి కొండ మీదకు విసిరి వేయగలిగిన వీరుడు.

గాడిద పచ్చి దవడ ఎముకచేత వెయ్యి మంది శత్రువులను చంపిన శూరుడు. ఇట్లా ఎన్నో...!ఇట్లాంటి ఆ యౌవనుడు; వేశ్యయైన స్త్రీ చేత ఆకర్షించ బడ్డాడు. తద్వారా....

శత్రువుల చేతిలోబంధీగా మారాడు. తల వెంట్రుకలు గొరిగించ బడ్డాయి. రెండు కళ్ళూ పెరికి వేయబడ్డాయి. దాగోను దేవతకు బలిగా మారాడు. అతడే సంసోను అతని జీవిత ప్రారంభం ఎట్లా వుంది? ఎట్లా ముగిసింది? దానికి గల కారణం? వ్యభిచారమే.

దేవునిచే భిషేకించబడిన ఒక రాజును కూడా నీ జ్ఞాపకం లోనికి తీసుకొని రావడానికి ఇష్టపడుతున్నాను. దేవుని చేత "నా హృదయానుసారుడు" అని సాక్ష్యము పొందినవాడు.

ఆయన కూడా ఇదే పాపములో చిక్కుకున్నాడు. దాని ఫలితం పుట్టిన బిడ్డ చనిపోయాడు.

పిల్లలు వ్యభిచారులు,

హంతకులయ్యారు. కన్నకొడుకే అతనిని చంపడానికి కంకణం కట్టుకున్నాడు. కనీసం చెప్పలు లేకుండా అతడు కొండలకు పారిపోవలసి వచ్చింది. కుక్క వంటి "షిమి " ఓ దుర్మార్గుడా, నరహంతకుడా! ఛీ! ఛో ...అంటూ దూషిస్తూ, శపిస్తూ వుంటే, మౌనముగా తల వంచాల్సి వచ్చింది. దేవుని పక్షంగా యుద్ధాలు చెయ్యడానికి అతనిని దేవుడు ఏర్పాటు చేసుకున్నాడు. ఇప్పడు ప్రజలు ఇక నీవు యుద్ధాలు చెయ్యొద్దని ప్రమాణం చేయించారు.

ఇట్లా... ఎన్నో! ఎన్నెన్నో!

అతడే దావీదు. గొల్యాతుపై విజయం అతని కీర్తిని పతాక స్థాయికి చేరిస్తే, బత్షెబతో పాపం, పతనం అంచులకు చేర్చింది.

యాజకుల వ్యభిచారం:

ఏలీ కుమారులైన హొప్నీ, ఫీనెహాసు మిక్కిలి దుర్మార్గులయ్యారు. వారు చేసిన ఘోరమైన పాపము ఏమిటంటే?

వారు ప్రత్యక్షపు గుడారముయొక్క ద్వారము దగ్గరకు సేవ చేయుటకువచ్చిన స్త్రీలతో శయనించే వారు. (1సమూ 2:22)

ఫలితం: ఒకే దినాన్న ఇద్దరూ మరణం.

**తుచ్ఛమైన అభిలాష:**

**( హోమో సెక్స్ , లెస్బినిజం)**

'హోమో సెక్స్' మగవారు మగవారితో కలసి లైంగిక పాపం చెయ్యడానికి పుట్టినిల్లు సొదొమ గొమొఱ్ఱా పట్టణాలే. ఆనాడు అక్కడ పుట్టిన పాపమే, ఈనాడు మహా వృక్షమై విచ్చలవిడిగా ప్రపంచమంతా వ్యాపించింది. నూరంతలుగా ఇంకా వర్ధిల్లుతూనే వుంది. సొదొమ గొమొఱ్ఱా పట్టణాలను నాశనం చెయ్యడానికి ఇద్దరు దేవదూతలు ఆ పట్టణములో ప్రవేశించగా, లోతు వారికి ఆతిథ్యమిచ్చుటకు అతని గృహానికి ఆహ్వానించినప్పడు, "వారు పండుకొనక ముందు ఆ పట్టణస్థులు, అనగా సొదొమ మనుష్యులు, బాలురును వృద్ధులును ప్రజలందరును నలుదిక్కులనుండి కూడివచ్చి ఆ యిల్లు చుట్టవేసి లోతును పిలిచిఈ రాత్రి నీ యొద్దకు వచ్చిన మనుష్యులు ఎక్కడ ? మేము వారిని కూడునట్లు మా యొద్దకు వారిని వెలుపలికి తీసికొని రమ్మని అతనితో చెప్పగా" (ఆది 19:4,5).

బాలురు మొదలుకొని వృద్ధుల వరకు, అదే పాపములో కొనసాగుతున్నారట. ఫలితం: అగ్ని గంధకాలతో కలసి మాడిపోయారు.

కొంత కాలం రహస్యముగా జరిగిన ఈ పాపం, నేడు బట్టబయలయ్యింది. మాకు నచ్చినట్లుగా జీవించే స్వేచ్ఛ కావాలంటూ, పోరాటాలు చేస్తున్నారు. చట్టాలు చేయించు కొంటున్నారు. వారి విజయం వారిని గమ్యం చేర్చేది కాదు. నిత్య నాశనమునకు నడిపించేది.

**ప్రియా నేస్తమా! లోకం పైశాచిక ఆనందాన్ని కోరుకొంటుంది. వికృత చేష్టలకు అలవాటుపడింది. అక్రమ జీవితం జీవిస్తుంది. అయితే, ఇట్లాంటి లోకంలో క్రమమైన జీవితాన్ని నీవు జీవించాలి. నీ యవ్వనమందు సంతోషిస్తూనే, వాటన్నిటిని బట్టి తీర్పు వున్నదనే మాట మాత్రం మరచిపోవద్దు.**

**వ్యభిచారులు...అగ్ని గంధకములతో మండు గుండములో పాలుపొందుదురు; ఇది రెండవ మరణము. (ప్రకటన 21:8).**

వద్దు! అది ఊహలకే భయంకరం.

పశ్చాత్తాప పడదాం! ప్రభు పాదాల చెంత చేరుదాం! ఆ నిత్య రాజ్యంలో ప్రవేశిద్దాం!

అట్టి కృప, ధన్యత దేవుడు మనకు అనుగ్రహించును గాక!

ఆమెన్! ఆమెన్! ఆమెన్!

# ఓ యౌవనుడా....!!!

# ఎట్లా పరుగులు తీస్తున్నావ్?

• కయీను దేవుని సన్నిధిలోనుండి పారిపోతున్నాడు.

• యాకోబు తండ్రిని, అన్నను మోసం చేసి పారిపోతున్నాడు.

• యోనా దేవుని మాట వినకుండా పారిపోతున్నాడు.

• చిన్న కుమారుడు తన తండ్రి ఇంటి నుండి పారిపోతున్నాడు.

అయితే,

• యోసేపు తన యవ్వనేచ్చల నుండి పారిపోతున్నాడు.

ఓ యౌవనుడా!!

పారిపోతున్నావా? పాపం

వెంటబడుతున్నావా?

**పాపము**

• చూడడానికి అందముగా వుంటుంది.

• చేస్తున్నప్పుడుఆనందాన్నిస్తుంది.

• చేసాక ఆవేదన మిగుల్చుతుంది.

**పాపము**

• నిన్ను తరుముతుంది.

• పట్టుకొంటుంది.

• బంధిస్తుంది

•దేవునినుండి దూరం చేస్తుంది.

• సమాధానం లేకుండా చేసి,

• చివరకు నీ ప్రాణం తీసి,

• నిన్ను మంటల్లోకి విసిరేసి,

అది పగలబడి నవ్వుతుంది.

**దానిని పట్టుకోవడానికేనా, నీ ఆరాటం?**

1. పాపము తరుముతుంది:

"కీడు పాపులను తరుమును" సామెతలు 13:21

2. పాపము పట్టుకొంటుంది:

"మీ పాపము మిమ్మును పట్టుకొనును" సంఖ్యా 32:23

3. పాపము బంధిస్తుంది:

"దుష్టుని దోషములు వానిని చిక్కులబెట్టును వాడు తన పాప పాశముల వలన బంధింపబడును." సామెతలు 5:22

**4. దేవుని నుండి వేరు చేస్తుంది:**

"మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను" యెషయా 59:2

**5. సమాధానం లేకుండా చేస్తుంది:**

"దుష్టులకు నెమ్మదియుండదని యెహోవా సెలవిచ్చు చున్నాడు. యెషయా 48:22

**ఇంతకీ నీవేస్థితిలో వున్నావ్?**

**దాని చేత తరమ బడుతున్నావా? నీవే దానిని తరుముతున్నావా? ఏదో సరదా కోసం, స్నేహితులను కాదనలేక ప్రారంభమైన ఆ అలవాట్లు నిన్ను బానిసను చేసి, అవే నీ బాస్ గా మారిపోయాయా? నీకున్న యౌవనేచ్ఛలు (శరీర కోరికలు) నీకు సమాధానం లేకుండా చేసేసాయా? ఎవ్వరితోనూ చెప్పకోలేక, వాటిని వదులుకోలేక, వాటి మధ్య కొట్టిమిట్టాడుతున్నావా?**

**నీ మార్గం సరియైనది కాదని నీ మనస్సాక్షి నీ మీద నేర స్థాపన చేస్తున్నా, వాని పీక నొక్కేసి అదే దారిలో వెళ్తున్నావు కదూ!**

**పాపం చెయ్యడానికి అన్ని ప్రయత్నాలూ చేసి, చివరికి సఫలం కాలేక, నేను పరిశుద్ధుడనే ఏ తప్పు చెయ్యలేదని నీకు నీవే సంబరపడి పోతున్నావు కదా?**

**యౌవనంలో వున్నాను. ఇట్లాంటివి సహజం అని నీకు నీవే సర్దిచెప్పేసు కొంటున్నావా? యవ్వనాన్ని యౌవనేచ్ఛలతో ఎంజాయ్ చేసి, సిలువలో దొంగలా ఒక్క మాటతో పరలోకంలో ప్రవేశిద్దామనే ఆలోచనలో ఉన్నావా? నీ యవ్వనాన్ని నీయౌవనేచ్ఛల కోసం, పిప్పిలాంటి మిగిలిన నీ జీవితాన్ని ప్రభువుకు సమర్పిస్తావా?**
**నీ ఎంగిలి జీవితం కాదు ప్రభువుకు సమర్పించాల్సింది. నీ యవ్వన జీవితం.**

**సమర్పణ అంటే ఏమిటో తెలుసా?**

**"చనిపోవడానికి బ్రతకడం"**

**ఒక అమ్మాయి కోసమో, ఒక అబ్బాయికోసమో కాదు చావాల్సింది. నీ యౌవనేచ్ఛలను చంపుకొని ప్రభువు కోసం జీవించడం సమర్పణ.**

**అట్లా తన యౌవనాన్ని దేవుని కోసం సమర్పించి జీవించగలిగిన ఒక యౌవనుడు నాకు తెలుసు. అతడు పరాయి దేశంలో బానిసగా వున్నాడు. తన యజమానురాలు తనతో పాపం చెయ్యమని వెంటబడే పరిస్థితి. తాను అట్లా చెయ్యగలిగితే? ఈలోకం సకల సౌఖ్యాలను ఆమె చేకూర్చి పెడుతుంది. కానీ, అతడు అట్లా చేసిన వాడు కాదు. పాపము తనని తరుముతూ వుంటే? దానికి చిక్కకుండా అందనంత వేగంగా, దూరంగా పారిపోయాడు. ఆ పరుగే అతనిని ఆ దేశ ప్రధానిని చేసింది.**

**ఇంతవరకూ, నీ జీవితంలో ఒక సినీ యాక్టర్, ఒక క్రికెట్ ప్లేయర్, ఒక పాప్ సింగర్, ఒక మ్యుజీషియన్ ఎవరో ఒకరు నీ రోల్ మోడల్ గా వున్నారేమో? అతనినే అనుకరించే ప్రయత్నాలు చేస్తున్నావేమో? కానీ, పాపము నుండి పారిపోయిన ఆ యౌవనుడే నీ యౌవనజీవితానికి రోల్ మోడల్ కావాలి. అతనినే నీవు అనుసరించ గలగాలి. అతడే యోసేపు.**

**ఇంటిలో పాపముందని అది పట్టుకొంటుందని, అతడు ఇంటి బయట వున్నాడట. నీవైతే పాపము ఎక్కడుందో? దాని చుట్టూనే తిరుగుతున్నావు కదా? నీ చూపులు, నీ తలంపులన్నీ దాని చుట్టూనే తిరుగుతున్నాయి కదా? అట్లా తలంచినంత మాత్రాన నేనేమి పాపం చెయ్యడం లేదుకదా అంటూ, నీకు నీవే సర్ది చెప్పకొనే ప్రయత్నం చెయ్యొద్దు.**

**మూర్ఖుని యోచన పాపము** సామెతలు 24:9

**ఆజ్ఞాతిక్రమమే పాపము.** 1యోహాను 3:4

**సకల దుర్నీతియు పాపము** 1యోహాను 5:17

హృదయ తలంపులు మలినమైతే? మన జీవితమంతా మలినమైనట్లే.

ఎందుకంటే?

దురాలోచనలు నరహత్యలు వ్యభిచారములు వేశ్యాగమనములు దొంగతనములు అబద్ధసాక్ష్యములు దేవదూషణలు హృదయములో నుండియే వచ్చును

మత్తయి 15:19

అందుచే,

నీ హృదయములోనుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నిటికంటె ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము

సామెతలు 4:23

**యౌవనుడా! నీ యౌవనేచ్ఛలనుండి పారిపో!**

వాటివల్ల నీ జీవితానికి సమాధానం లేదు. నిన్ను కని, పెంచి, పెద్ద చేసిన నీ తలిదండ్రులకు సమాధానం లేదు. నీకోసం ప్రాణం పెట్టిన నీ దేవునికి సమాధానం లేదు.

నీవు ,యౌవనేచ్ఛలనుండి పారిపొమ్ము, పవిత్ర హృదయులై ప్రభువునకు ప్రార్థన చేయువారితోకూడ నీతిని విశ్వాసమును ప్రేమను సమాధానమును వెంటాడుము. 2 తిమోతి 2:22

నీ యౌవనేచ్ఛలనుండి నుండి పారిపోయినంత మాత్రానా ప్రయోజనం లేదు. నీ సహవాసం మారాలి. పరిశుద్ధ హృదయం కలిగి, ప్రభువుతో సహవాసం చేసేవారితో నీవు సహవాసం చెయ్యాలి.

ఇంతవరకూ పాపాన్ని వెంటాడిన నీవు, ఇప్పుడు నీతిని, విశ్వాసమును, ప్రేమను, సమాధానమును వెంటాడాలి.

**1. నీతి:**

అయనను నమ్మడమే నీతి. ఆది 15:6

**2. విశ్వాసమును:**

విశ్వాసమునకు కర్త ఆయనే. హెబ్రీ 12:2

**3. ప్రేమ:**

ఆయనే ప్రేమాస్వరూపి, 1 యోహాను 4:8

**4. సమాధానము:**

ఆయనే మన సమాధానము ఎఫెసీ 2:14

**యౌవనేచ్ఛలను విడచి, నీ కోసం తన యౌవన రక్తాన్ని చిందించిన యేసయ్యను వెంబడించు. ఇక సమాధానం నీ వెంటే పరుగులు తీస్తుంది. ప్రయత్నించి చూడు, నీ జీవితం ధన్యమౌతుంది.**

అట్టి కృప, ధన్యత

దేవుడు నీకు అనుగ్రహించునుగాక!

⋆ఆమెన్! ఆమెన్! ఆమెన్!⋆

# యౌవనుడా!

# ఎంజాయ్ యువర్ లైఫ్!

ఎంజాయ్ అంటే?
బీర్లతో బార్లలో గడపడం.
బాయ్ ఫ్రెండ్స్ తో , గాళ్ ఫ్రెండ్స్ తో తిరగడం. చాటింగ్, డేటింగ్,
బైక్స్ మీద చక్కర్లు కొట్టడం, సినిమాలు, షికార్లు, సిగరెట్లు, ఖైనీలు, గూట్కాలు.... ఇట్లా ఎన్నెన్నో.

అవును! యవ్వనం తిరిగిరాదు కదా? నీ యవ్వనంలో నీకు నచ్చినట్లుగా ఎంజాయ్ చెయ్. నీకున్న కోరికలన్నీ తీర్చుకో. ఏది కావాలంటే అదిచూడు. నీ కన్నులు నీ ఇష్టం. కన్నులు చూడడానికే కదా?

**అయితే? ఒక్క విషయం మాత్రం మరచిపోవద్దు.**
**నీవు ఏదయితే చేసావో? అది మంచిదైనాసరే! చెడ్డదైనా సరే! తీర్పు నుండి మాత్రం ఎట్టి పరిస్థితులలోనూ తప్పించుకోలేవు.**

**యౌవనుడా, నీ యౌవనమందు సంతోషపడుము, నీ యౌవనకాలమందు నీ హృదయము సంతుష్టిగా ఉండ నిమ్ము, నీ కోరికచొప్పునను నీ దృష్టియొక్క యిష్టము చొప్పునను ప్రవర్తింపుము; అయితే వీటన్నిటి నిబట్టి దేవుడు నిన్ను తీర్పులోనికి తెచ్చునని జ్ఞాపక ముంచుకొనుము;** ప్రసంగి 11:9

ఇంతకీ, ఎటువైపు నీ చూపులు?
ఏంటి నీ కోరికలు?

అమ్నోను చూపులు చెల్లెలు మీదకు మళ్ళాయట. చింతాక్రాంతుడై తన కోరిక చేత చిక్కిపోతున్నాడట. 2 సమూ 13:2
చివరకి తాను కోరుకున్నట్లే చేసాడు. ఫలితం? ప్రాణం కోల్పోయాడు.

చిన్న కుమారుని చూపులు రంగుల ప్రపంచం మీదకు మళ్ళాయట. ఏమయ్యింది?
ఫలితం? పందులపొట్టే ఆహారం. లూకా 15:16

దేవునిచేత ఏర్పరచబడిన సంసోను చూపులు వేశ్య మీదకు మళ్ళాయట. (న్యాయాధి 16:1)
ఏమయ్యింది?
సింహాన్ని సహితం చీల్చి వేసినవాడు, పచ్చి గాడిద దవడ ఎముకతో వెయ్యి మందిని చంపినవాడు, మూడు వందల నక్కలను పట్టుకొని శత్రువుల పొలాలను నాశనం చేసినవాడు,
ఇప్పుడు, ఏ కళ్ళు అయితే ఆ వేశ్యను చూసాయో? ఆ రెండు కళ్ళూ పెరికి వేయబడ్డాయి. దాగోను దేవతకు బలి పశువుగా నిలబడ్డాడు.

దీనా చూపులు లోకం మీదకు మళ్ళాయట. దీనా ఆదేశ కుమార్తెలను చూడాలనుకుంది. ఆది 34:1
ఏమయ్యింది?
ఆ దేశ రాజకుమారుడు ఆమెను చూసాడు, పాడుచేసాడు. తద్వారా దీనా అన్నలు హంతకులుగా మార వలసివచ్చింది.

ఒక్కసారి ఆలోచించు!!
వీళ్ళంతా లోకాన్ని ఎంజాయ్ చేద్దాం అనుకున్న వాళ్ళే. కాని వారిఅంతం ఎట్లా వుంది? నీ జీవితం సంతోషంగా, సాఫీగానే సాగిపోతుందిలే అనుకొంటున్నావా? కాని, దాని అంతం మాత్రం ఘోరంగా వుంటుంది. ఆ దినాన్న మాత్రం తప్పించుకోలేవు. అల్పకాల సుఖ భోగాలను చూసుకొని నిత్య రాజ్యాన్ని కాళ్ళతో తన్నేస్తావా?

యోసేపు పవిత్రమైన జీవితాన్ని జీవించ గలిగాడు. ఇస్సాకు దేవుని కోసం అర్పణగా మారడానికి సిద్ధపడ్డాడు. యోఫ్తా కుమార్తె దేవునికోసం అర్పణగా మార్చబడింది.
వారి జీవితాలు ధన్యమయ్యాయి.

చివరిగా ఒక్క మాట!
ఆనందం ఎక్కడ వుందో తెలుసా?
అది యేసయ్యలోనే.
యేసయ్యలో ఆనందం
సమాధానకరమైనది.
అది శాశ్వతమైనది.

యౌవనుడా!
ఎంజాయ్ చెయ్ యేసయ్యతోనే!!

# యౌవనుడా!!

# యేసయ్యకు నీవే కావాలి!!!

**ఒక ప్రసంగీకుని మాటలు వింటున్నప్పుడు, నేనట్లా ప్రసంగించలేక పోతున్నానే?**
**ఒక సింగర్ పాడుతున్నప్పుడు, నేనట్లా పాడలేకపోతున్నానే?**
**ఒక మ్యుజిషియన్ వాయిస్తున్నప్పుడు, నాకట్లాంటి నైపుణ్యములేవి లేవే? ... అంటూ వాళ్ళనీ వీళ్ళనీ పోల్చుకొని క్రుంగిపోయేవారు కొందరైతే? వాళ్ళనీ వీళ్ళని పోల్చుకొని వారికున్న తలాంతులను చూచి పొంగిపోయేవారు మరి కొందరు.**

**ఎవ్వరితోనూ నీవు పోల్చుకోనవసరం లేదు. ఎందుకంటే? నీలాంటి వారు ఈలోకంలో ఎవ్వరూలేరు. ఒక తల్లికి పుట్టిన కవలలో కూడా చెప్పలేనన్ని వ్యత్యాసాలు. నీకు నీవే ప్రత్యేకం. నిన్ను ప్రత్యేకంగా దేవుడు సృష్టించాడు. నీ పట్ల ఒక ప్రత్యేకమైన ప్రణాళికను కలిగియున్నాడు. అట్లాంటప్పుడు? నేను చేతకానివాడిని, చేతకానిదానను అంటూ ఎందుకు క్రుంగిపోతున్నావ్?**

ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండునట్లు, జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములోనుండు వెఱ్ఱివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైనవారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు.ఎన్నికైన వారిని వ్యర్థము చేయుటకు లోకములో నీచులైనవారిని, తృణీకరింప బడినవారిని, ఎన్నికలేనివారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు. 1 కొరింధి 1: 27-29

**దేవుడు నిన్ను వాడుకోవడానికి నీకున్న జ్ఞానం, నీకున్న తలాంతులే కారణం అనుకోవడం అవివేకం. నీకు ఆరోగ్యంవున్నా-లేకున్నా, చదువున్నా-లేకున్నా, బాస్ వి అయినా-సాతానుకు బానిసవైనా , మాటకారివైనా-నత్తివాడవైనా,**
**చిన్నవాడవైనా-పెద్దవాడవైనా,**
**నీస్థితి ఏదయినా సరే 'నీవు ఆయనకు కావాలి'.**

**షోమ్రోను పట్టణం ఆకలితో అల్లాడిపోతున్నప్పుడు, వారి ఆకలిని తీర్చడానికి దేవుడు "కుష్టురోగులను" ఏర్పాటు చేసుకున్నాడు. 2 రాజులు 7:9**
**ఇశ్రాయేలీయులు, ఐగుప్తు దాస్యములో మ్రగ్గిపోతున్నప్పుడు, వారిని విడిపించడానికి "నత్తివాడైన" మోషేను నాయకుడిగా దేవుడు ఏర్పాటు చేసుకున్నాడు. నిర్గమ 4:10**
**ఐదు వేలమంది ఆకలిని తీర్చడానికి 'చిన్నవాడు' తెచ్చిన 'చిన్న ఆహారము'నే ప్రభువు వారు వాడుకున్నారు. యోహాను 6:9**
**సైన్యాధ్యక్షుడైన నయమాను కుష్టురోగము బాగుపడడానికి బానిసయైన 'చిన్నది' ఇశ్రాయేలు దేవుని శక్తిని గూర్చి ఇచ్చిన సమాచారమే కారణమయ్యింది. 2 రాజులు 5:4**
**యుద్ధ శూరుడైన గొల్యాతును సంహరించడానికి 'బాలుడైన' దావీదును, 'ఒడిసెలు' ను ఆయుధంగా ఎన్నుకున్నాడు. 1 సమూయేలు 17:33**
**యేసు ప్రభువు వారు తన రాజ్య సువార్తను వ్యాప్తి చెయ్యడానికి చేపలపట్టు 'జాలరులను' తన శిష్యులుగా ఎన్నుకున్నాడు. మత్తయి 10:2**
**యేసుప్రభువు వారు తన ప్రయాణానికి హేరోదు గుర్రాలనుకాదు వాడుకున్నది. కట్టబడిన 'గాడిదపిల్ల' ఆయనకు కావలసి వచ్చింది. మార్కు 11:2**

**అవును! సాతాను కట్లచే బంధించబడిన నీవే ఆయనకు కావాలి. యేసును మోసిన ఆ గాడిద పిల్లవు నీవే కావాలి.**
**నీకు నీవే తగ్గించుకొని, నావల్ల ఏమి కాదని, దేవునికి నేను పనికిరానని చెప్పి, దేవుని పని చెయ్యకుండా తప్పించుకొనే ప్రయత్నం చెయ్యొద్దు.**

**ప్రసంగాలు చేస్తూ, పాటలు పాడుతూ, ఇంకా ఏవోవో చేస్తూ దేవునికి దూరంగా జీవించే వారికంటే, ఆయనకోసం జీవించాలనే ఆశను కలిగియున్న 'నీవే ఆయనకు కావాలి'.**
**నిజంగా నీవే ఆయనకు కావాలి!!**

**ఆయన కోసం వాడబడడానికి సిద్దపడదాం! ఆరీతిగా మన జీవితాలను సిద్ద పరచుకుందాం!**
**అట్టి కృప, ధన్యత దేవుడు మనకు అనుగ్రహించునుగాక!**
**ఆమెన్! ఆమెన్! ఆమెన్!**

# యవ్వనుడా! యవ్వనురాలా!

# త్రాగుడికి బానిసయ్యావా?!!!

త్రాగుడు ఒక ఫ్యాషన్ అయ్యింది. అదొక స్టాటస్ సింబలయ్యింది. త్రాగి తందనాలాడేవాడు హీరో అవుతున్నాడు. త్రాగని వాడెమో జీరో అవుతున్నాడు. త్రాగిన వాడు ఏమి మాట్లాడతాడో తెలియదు? ఎందుకు నవ్వుతాడో తెలియదు? ఏమి చేస్తాడో తెలియదు? అడుగు ఎక్కడ వేస్తాడో తెలియదు? జేబులు ఖాళీ అయ్యేవరకూ త్రాగుతూ ఊగుతూ ఉంటాడు. ఏ భేదం లేదు. పిల్లలూ, యవ్వనులూ, వృద్ధులూ అందరూ త్రాగుతూనే వున్నారు. దాని ఒడిలో ఊగుతూనే వున్నారు? మత్తు పదార్థాల మత్తులో జోగుతోంది లోకం.

అల్లర్లకు కారణం?
యాక్సిడెంట్లకు కారణం? కుటుంబాలు విచ్చిన్నానికి కారణం? రోగాలు, ఆర్థిక, మానసిక ఒడిదుడుకులకు కారణం? ప్రశ్నలు ఎన్నైనా కావొచ్చు. సమాధానం మాత్రం ఒక్కటే. అదే "త్రాగుడు వ్యసనం".

**యువత త్రాగుడుకి బలై పోతుంది. వారి వ్యసనం కోసం వ్యక్తిగత, కుటుంబ గౌరవాన్ని తాకట్టు పెట్టేస్తున్నారు. పెగ్గు కోసం సిగ్గులేకుండా చేతులు చాస్తున్నారు.**
**కనీసం బర్త్ డే పార్టీలు కూడా బీర్ లతో బార్ లో గడపడానికే సిద్ధపడుతున్నారు? ఒక్క మాటలో చెప్పాలి అంటే? పార్టీ అంటేనే మద్యం. మద్యం లేకపొతే అది పార్టీనే కాదు.**

ఇప్పుడు ఈ పార్టీలు ఎక్కడివరకు వచ్చేసాయాంటే? దేవుని సేవకుల ఇంటి వరకు వచ్చేసాయి. ఆంధ్ర ప్రదేశ్ లో గొప్ప వున్నత స్థానంలో నున్న సేవకుని కుమారుని వివాహంలో మద్యం ఏరులై ప్రవహించింది. అయ్యో! అదేమిటి అంటే? వాళ్ళేమన్నా తింగరోళ్ళా? బైబిల్ కాలేజీల్లో తర్ఫీదు పొందిన రెవరెండ్స్. దానికి క్లారిఫికేషన్ కూడా ఇచ్చారు. బయట నుండి లోనికి వెళ్ళినది ఏది మనలను అపవిత్ర పరచదట. మనము పరిశుద్ధముగా కాపాడుకోవలసినది శరీరంను కాదట. ఆత్మను. ఎందుకంటే? మట్టి నుండి తీయబడిన శరీరం మట్టిలోనే కలసిపోతుందట. ఆత్మ మాత్రమే దేవుని దగ్గరకు వెళ్తుంది. కాబట్టి, ఆత్మకు మాత్రం ఎట్లాంటి కళంకం అంటుకోకుండా చూచుకోవాలట. ఎంత బాగా చెప్పారు కదా?

అయితే, పౌలు ఇట్లా ఎందుకు వ్రాశాడో? శరీరం మలినమై పోయినప్పుడు, ఆత్మ ఎట్లా పరిశుద్ధంగా వుండగలుగుతుందో?

ప్రియులారా, మనకు ఈ వాగ్దానములు ఉన్నవి గనుక దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తిచేసి కొనుచు, శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషము నుండి మనలను పవిత్రులనుగా చేసికొందము. 2 కొరింది 7:1

మరికొంత మంది ఇంకా తెలివిగా మాట్లాడతారు. పౌలు తిమోతికి వ్రాసాడు కదా? అని. ఏమని వ్రాసాడు?

**ఇకమీదట నీళ్లేత్రాగక నీ కడుపు జబ్బునిమిత్తమును తరచుగా వచ్చు బలహీనతల కోసరమును ద్రాక్షారసము కొంచెముగా పుచ్చుకొనుము. 1 తిమోతి 5:23**

**కడుపు జబ్బు నిమిత్తం ద్రాక్షారసం పుచ్చుకోమని. అయితే, ఈ త్రాగే వాళ్లంతా కడుపు జబ్బుకోసమే త్రాగుతున్నారా? అయినా, ద్రాక్షారసము, మద్యము రెండూ ఒక్కటేనా? ద్రాక్షారసము పులియబెడితే మద్యం అవుతుంది.**

కడుపు జబ్బుకు కొంచెం ద్రాక్షారసము త్రాగమని తిమోతికి సూచిస్తున్నాడు పౌలు. అంటే? తిమోతి కడుపు జబ్బుతో బాధ పడుతున్నాడు. అది అతడు త్రాగే నీరు సరైనది కాకపోవడం వలన కలిగినది. ఆ దినాలలో ఔషధాలు అందుబాటులో లేనికారణం చేత, ద్రాక్షారసంలో కొన్ని ఔషధ గుణాలు వుండడం చేత త్రాగే నీటిలో కొంచెం ద్రాక్షారసం కలుపుకొని త్రాగడం సర్వ సాధారణం. మన వాళ్లేమో మద్యంలో నీళ్లు కూడా కలపకుండా త్రాగుతూ దీనిని పౌలు మాటలకు జత కట్టేసారు.

**ఒక్క విషయం గుర్తుంచుకో! విషం కలిగి యున్న సీసా మీదా 'విషం' అనే పేరు తీసేసి, 'అమృతం' అని వ్రాసినంత మాత్రాన అది అమృతముగా మారిపోదు కదా? 'పాపము' అనే దానిని 'పొరపాటు' అని పిలచుకున్నంత మాత్రాన అది పాపం కాకుండా పోదుగా.**

నాకు తెలిసిన ఒకాయన గల్ఫ్ నుండి వచ్చి, కృతజ్ఞతా కూడిక పెట్టుకొని, సంఘ పెద్దలందరికీ పార్టీ ఇచ్చాడు. అయ్యగారు ఒక్కరే వున్నారని, ఒకాయన వెళ్లి, అయ్యగారూ మీరు కూడా ఒక పెగ్గు పుచ్చుకుంటారేంటి? అనడిగితే? ఆ అయ్యగారు ఫారిన్ ది అయితే, పర్వాలేదన్నాడట. ఇంకేముంది? ఆయ్యగారే పార్టీలో వుంటే? పెద్దలకెంత బలం? విశ్వాసులకు ఇంకెంత బలం?

కంచే చేను మేసేస్తుంటే? ఇక కాపాడేదెవరు? సంఘానికి మాదిరికరంగా వుంటూ, ఆధ్యాత్మిక విలువలు నేర్పాల్సిన నీవే గాఢాంధ కారములో కొట్టుమిట్టాడుతుంటే? ఇక సామాన్యుల గతేమిటి?

**మద్యం సేవించేవారు సంఘ పెద్దలుగా ఉండకూడదు. 1తిమో3:3**

నీవంటావ్! ఆయన త్రాగడం లేదా? ఈయన త్రాగడం లేదా అని. ఆయన సంగతి, ఈయన సంగతి నీకెందుకు? నీవు చూడాల్సింది ఆయనను, ఈయనను కాదు. నీ పరిశుద్ధుడైన దేవునిని మాత్రమే. అనుసరించాల్సింది ఆయనను, ఈయనను కాదు. పరిశుద్ధ గ్రంథమును మాత్రమే.

మరి కొందరంటారు! పరిశుద్ధ గ్రంథంలో ఆయన త్రాగలేదా? ఈయన త్రాగలేదా అని. అవును! త్రాగారు. ప్రతిఫలాన్ని అనుభవించారు. నీ జీవితం అట్లా కాకూడదనే, వారి జీవితాలను దృష్టాంతాలుగా నీ ముందుంచాడు దేవుడు.

- మద్యం వలన నోవాహు వస్త్రహీనుడయ్యాడు.

నోవహు నీతిపరుడును తన తరములో నిందారహితుడునై యుండెను. నోవహు దేవునితో కూడ నడచినవాడు. ఆది 6:9
అట్లాంటి వ్యక్తిని ద్రాక్షారసము వస్త్రహీనుని చేసింది.
పిమ్మట ద్రాక్షారసము త్రాగి మత్తుడై తన గుడారములో వస్త్రహీనుడుగా నుండెను. ఆది 9:21

నోట్: మొట్టమొదటగా ద్రాక్ష తోట వేసింది నోవహునే కాబట్టి, అట్లా జరుగుతుందని అతనికి తెలుసో? లేదో? అందుచే, పూర్తిగా అతనిని తప్పు పట్టలేము.

- మద్యం వలన వరసలు తెలియవు: ఆది 19:30-38

ఇది సృష్టిలోనే ఒక అసహ్యమైన కార్యము. దీనికి ప్రధాన పాత్ర పోషించింది మద్యమే. ఈ చర్య దేవునికి వ్యతిరేకమైన రెండు జనాంగములు భూమి మీదకు కారణమయ్యింది.

- మద్యం వలన అల్లరి పుట్టును.

ద్రాక్షారసము వెక్కిరింతల పాలుచేయును మద్యము అల్లరి పుట్టించును. సామెతలు 20:1

- మద్యం వలన జ్ఞానము లేనివారు అగును.

ద్రాక్షారసము వెక్కిరింతల పాలుచేయును మద్యము అల్లరి పుట్టించును దాని వశమైనవారందరు జ్ఞానములేనివారు. సామెతలు 20:1

- మద్యం వలన దరిద్రులు అగుదురు.

త్రాగుబోతులును తిండిపోతులును దరిద్రులగుదురు. సామె 23:21

- మద్యం వలన శ్రమలు, దుఃఖము, గాయములు కలుగును.

ఎవరికి శ్రమ? ఎవరికి దుఃఖము? ఎవరికి జగడములు? ఎవరికి చింత? ఎవరికి హేతువులేని గాయములు?ఎవరికి మంద దృష్టి?
ద్రాక్షారసముతో ప్రొద్దుపుచ్చువారికే గదా కలిపిన ద్రాక్షారసము రుచిచూడ చేరువారికే గదా. సామెతలు 23:29,30

- మద్యం వలన ఆజ్ఞలు మరతురు.

ద్రాక్షారసము త్రాగుట రాజులకు తగదు లెమూయేలూ, అది రాజులకు తగదు మద్యపానాసక్తి అధికారులకు తగదు.

త్రాగినయెడల వారు కట్టడలను మరతురు దీనులకందరికి అన్యాయము చేయుదురు   సామెతలు 31:4,5

**• మద్యం వలన పరలోకం వెళ్లలేరు.**

దొంగలైనను లోభులైనను త్రాగు బోతులైనను దూషకులైనను దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు.      1కొరింది 6:10

**• దుర్వ్యాపారం నడుపుతురు.**

మద్యముతో మత్తులైయుండకుడి, దానిలో దుర్వ్యాపారము కలదు; అయితే ఆత్మ పూర్ణులైయుండుడి.      ఎఫెసి 5:18

**• మతి చెడును.**

వ్యభిచారక్రియలు చేయుటచేతను ద్రాక్షారసము పానముచేయుటచేతను మద్యపానము చేతను వారు మతిచెడిరి. హోషేయ 4:11

**• జబ్బు పడుదురు.**

మన రాజు దినమున అధిపతులు అతని ద్రాక్షారస బలముచేత మత్తిల్లి జబ్బుపడిరి;  హోషేయ 7:5

**• తత్తర పడుదురు.**

అయితే వీరును ద్రాక్షారసమువలన సొక్కి సోలుదురు మద్యమువలన తత్తరపడుదురు యాజకులేమి ప్రవక్తలేమి అందరును మద్యమువలన సొక్కి సోలుదురు ద్రాక్షారసము వారిని మింగివేయుచున్నది మద్యమువలన తత్తరపడుచున్నారు దర్శనము కలుగునప్పుడు సోలుదురు తీర్పుతీర్చుకాలమున తత్తరపడుదురు.   యెషయా 28:7

**• చెడు పాటలు పాడుదురు.**

గుమ్మములలో కూర్చుండువారు నన్నుగూర్చి మాట లాడుకొందురు త్రాగుబోతులు నన్నుగూర్చి పాటలు పాడుదురు.   కీర్తనలు 69:12

**• త్రాగుబోతులకు శ్రమ.**

ద్రాక్షారసము త్రాగుటలో ప్రఖ్యాతినొందిన వారికిని మద్యము కలుపుటలో తెగువగలవారికిని శ్రమ.  యెషయా 5:22

**• నరకానికి వెళ్లెదరు.**

మత్తయి 24:49-51, ప్రకటన 14:10

ఇటువంటి త్రాగుబోతులతో సహవాసము చేయకూడదు. (సామెతలు 23:20)

**కావున ప్రియ సహోదరి/సహోదరుడా! నీ సహవాసం ఎవరితో చేస్తున్నావ్?**

**అటువంటి త్రాగుడికి, త్రాగుబోతు విందులకు మనం దూరమై, పరమపురికి చేరుదాం !**

**ఆమెన్! ఆమెన్! ఆమెన్!**

# ఓ యౌవనుడా!!

# నీకున్న ఆశలేమిటి?

**ఒక మనిషి ఆహారం లేకుండా 54 రోజుల వరకు, నీరు లేకుండా 3 రోజుల వరకు, ఆక్సిజన్ లేకుండా 8 నిమిషాల వరకు జీవించగలడట.**

**కానీ, ఆశ లేకుండా ఒక్క సెకెను కూడా జీవించలేడట.**

అవును! ఆశను కలిగియుండాలి. ఆశావాదిగానే బ్రతకాలి.

అయితే, యౌవనుడా!!

నీ ఆశ ఏమిటి?

**డేవిడ్ లివింగ్ స్టన్ కు దేవుని కోసం జీవించాలనే ఆశ. సమస్తాన్ని త్యాగం చేసి, ఆఫ్రికాకు వెళ్లి, నరమాంస భక్షకుల మధ్య పరిచర్య చేసి, చీకటి ఖండాన్ని క్రీస్తు  వెలుగుతో నింపి, అక్కడే మరణించాడు.**

**ఇంతటితో అతని చరిత్ర ముగిసిపోలేదు. చనిపోయిన శవం కోసం రెండు దేశాలు తగవులాడుకొనే పరిస్థితి. చిట్ట చివరకు ఆయన గుండెను తీసి ఆఫ్రికాలో సమాధి చెయ్యగా, మిగిలిన దేహాన్ని 900 మైళ్ల దూరం మోసి, ఓడ రేవుకు చేర్చి, ఇంగ్లాండు తీసికొనివచ్చి అక్కడ రాజ కుటుంబీకులను సమాధి చేసే స్థలములో సమాధి చేశారు.**

**జర్మనిలో నున్న జోసెఫ్ డేనియన్ కు ఒక ఆశ. దేవునికోసం ఏదైనా చెయ్యాలని. అమెరికా లోని మొలకాయ్ దీవిలోనున్న కుష్టు రోగులకు సేవ చెయ్యడానికి వెళ్లి, తానూ కుష్టు రోగిగా మారి, వారికి సువార్తను ప్రకటిస్తూ, వారికి సేవ చేస్తూ వారి మధ్యనే చనిపోయాడు. ఇతని శవం కోసం కూడా ఇదే పరిస్థితి. చివరకు అతని చేతులు నరికి అమెరికా లోని మొలకాయ్ దీవిలో పాతిపెట్టారు. మిగిలిన దేహాన్ని జర్మనీ తీసుకొని వెళ్లి సమాధి చేశారు.**

**శవం కోసం రెండు దేశాలు తగవులాడుకొని, ఒకే శవాన్ని రెండు దేశాలలో సమాధి చేశారంటే? ఆ శవాలకున్న ప్రత్యేకత ఏమిటి? ఏమీ లేదు. వారు కలిగియున్న ఆశ, వారు జీవించిన జీవితం అట్లాంటిది. ఆ శరీరం అనే గుడారములో నివసించిన ఆత్మ అట్లాంటిది.**

ఇంతకీ, శవం విలువ ఎంతో తెలుసా?

మనిషిలోనుండి ప్రాణం వెళ్ళిపోతే? ఆ శవము ఖరీదు ఎంతో చాలా కాలం క్రిందట లెక్కలు కట్టారు.

ఆ శవములో వుండే ....

* క్రొవ్వులు - ఒక సబ్బు తయారీకి
* భాస్వరము - ఒక అగ్గి పెట్టె తయారీకి
* ఐరన్ - రెండు మేకులు తయారీకి
* ఎముకలు - ఒక కోళ్ల గూడుకు సున్నం వేయడానికి సరిపోతాయట. ఇట్లా... ఆ శవము విలువ రూ 6:40 అని లెక్కలు కట్టారు.

నీవొక విషయం ఆలోచించాలి!!!

మట్టి నుండి తీయబడిన నీవు, మట్టిలోనికే చేరతావు. ఆ విషయం నీకు పక్కాగా తెలుసు. అయితే, మరొక విషయం కూడా నీకు తెలియాలి. నీ ఆశలు భూసంబంధమైనవైతే? నీ క్షయమైన శరీరముతో పాటే, అవి కూడా క్షయమైపోతాయి.

అంతేకాదు, మరొక విషయం కూడా నీకు స్పష్టంగా తెలియాలి.

సమాధితో మనిషి చరిత్ర సమాప్తం కాలేదు. ఆ తర్వాతే వుంది అసలైన శాశ్వత జీవితం. ఇప్పుడు నీవు కలిగియున్న ఆశలే నిన్ను నిత్య జీవానికి గాని, నిత్య మరణానికి గాని చేర్చుతాయి.

ఈలోకంలో నీవు కలిగియున్న లోకాశలన్నియూ లోక సంబంధమైనవే తప్ప, అవి దేవుని వలన కలిగినవి కావు. అవి నిన్ను దేవుని నుండి దూరం చేస్తాయే తప్ప, ఎన్నటికీ నిన్ను ఆయన దగ్గరకి చేర్చలేవు. ఈలోకంతో నీవు కూడా గతించి పోకుండా వుండాలంటే? ఆ నిత్య రాజ్యములో నిత్యమూ నీవుండాలంటే?

ఆయన చిత్తాన్ని నెరవేర్చాలి.

లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రివలన పుట్టినవి కావు; అవి లోకసంబంధమైనవే. లోకమును దాని ఆశయు గతించిపోవుచున్నవి గాని, దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరమును నిలుచును. 1యోహాను 2:16,17

*** శరీరాశ:**

లోకంలో నున్నదంతా శరీరం అనుభవించాలని కోరుకొంటుంది. దాని ఆశలకు కళ్లెం వెయ్యకపోతే, దాని ఫలితాలు ఎంత ఘోరంగా వుంటాయంటే?

శరీరకార్యములు స్పష్టమైయున్నవి; అవేవనగా, జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి. .........ఇట్టి వాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నాను. గలతి 5:19-21

* నేత్రాశ :

రంగుల ప్రపంచంలో వున్నాము. వీటన్నిటిని చూడాలను కొంటాయి మన కన్నులు. వాటిని అభ్యంతర పరచకపోతే? నీ దేహానికి వెలుగు నీ కన్నే కాబట్టి, నీ జీవితమంతా చీకటయిపోతుంది.

సంసోను కన్నులు లోకాన్ని ఆశించాయి. ఆ రెండు కన్నులూ పెరికివేయ బడ్డాయి.

అయితే, నీవొక నిర్ణయానికి రావాలి. అదేమిటంటే? కీర్తనాకారునిలా ప్రార్థించాలి. యోబులా ఒక నిబంధన చెయ్యాలి.

వ్యర్థమైనవాటిని చూడకుండ నా కన్నులు త్రిప్పి వేయుము నీ మార్గములలో నడుచుకొనుటకు నన్ను బ్రదికింపుము. కీర్తనలు 119:37

నేను నా కన్నులతో నిబంధన చేసికొంటిని కన్యకను నేనేలాగు చూచుదును? యోబు 31:1

* జీవపుడంబము:

అనుక్షణం మనిషి తన్నుతాను హెచ్చించుకొనే ప్రయత్నాలే చేస్తున్నాడు తప్ప, తనని హెచ్చించిన దేవుని హెచ్చించాలని, తాను ఎదిగే కొలదీ ఒదిగి వుండాలనే ధ్యాసే లేదు.

**అవును! నీవు ఎవరినో ఆకర్షించాలనే ఉద్దేశ్యంతో జీవములేని డంబపు మాటలతో, అతిశయంతో, గొప్పలు చెప్పకొంటూ, మాటలు కోటలు దాటుతున్నాయేమో? జీవపుడంబము నిన్ను దేవునికి అవిధేయునిగా మార్చేస్తుంది.**

వద్దు! నీ అతిశయం ఏదైనా వుందంటే? అది దేవునియందే.

**ఓ యౌవనుడా!**

**లోకాశాలను విడచి పెట్టు. ఎందుకంటే? నిన్ను ఆకర్షించే ఈ లోకం కాటువేసే విష సర్పము. దాని జోలికి పోవద్దు. లోకంలోనే నీవుండాలి. కానీ, లోకం నీలో వుండకూడదు. దాని ఆశలను అనుసరించ కూడదు. దాని గమ్యం నిత్య మరణం.**

దేవుని చిత్తాన్ని జరిగించడానికి నీవు ఆశను కలిగియుండు. అట్టి రీతిగా జీవించు. దాని గమ్యం నిత్య జీవం.

ఆ రీతిగా నీ జీవితాన్ని సిద్ధ పరచుకో! అట్టి కృప, ధన్యత
దేవుడు నీకు అనుగ్రహించునుగాక!
ఆమెన్! ఆమెన్! ఆమెన్!

# యవ్వనుడా!

# ........లవ్ & ట్రూ లవ్ ......

# (ప్రేమలో మాదిరి)

నీ ,యౌవనమునుబట్టి ఎవడును నిన్ను తృణీకరింపనియ్యకుము గాని, మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను, విశ్వాసులకు మాదిరిగా ఉండుము.

1తిమోతి 4:12

'ప్రేమ' ప్రపంచ భాషల్లో అత్యంత శక్తివంత మైన పదం. నేటికినీ మనిషి ప్రేమను నిర్వచించడానికి ప్రయత్నిస్తూనే వున్నాడు. దాని అర్థమేమిటో తెలియకున్నా అది చేసేపనులు లెక్కలేనన్ని.

లోకం దృష్టిలో ప్రేమంటే?

**మూడవ తరగతి చదివే అబ్బాయి, అదే తరగతి చదివే అమ్మాయికి 'I LOVE U' అని వ్రాసి ఆ అమ్మాయి బుక్ లో పెట్టేసాడు. అంటే? ప్రైమరీ నుండే ప్రారంభ మయిపోయింది ప్రేమ.**

ఒక టీనేజర్ ప్రేమంటూ తిరిగీ, తిరిగీ, పరీక్షల ఫలితాలు వచ్చాక తెలిసింది ప్రేమంటే ఏమిటో? **Loss Of Valuable Education అని. మరొకడేమో రాత్రంతా చాటింగ్. నిద్రలేక నీరసం వచ్చాక వాడికి అర్థమయ్యింది ప్రేమంటే? Loss Of Valuable Energy.అని**

**ఒక అబ్బాయికి ఒక అనుమానం. నా గర్ల్ ఫ్రెండ్ నా పేరును తన మొబైల్ లో ఏమని సేవ్ చేసుకుందో అని. మొత్తానికి తెలుసుకున్నాడు. ''టైం పాస్ 20' అని. అంటే? వీడి క్రింద ఇంకో 19 మంది. వీడిపైన ఎంత మందో? ఇప్పుడు వీడికి అర్థమయ్యింది ప్రేమంటే? 'టైం పాస్' అని.**

ఒకడేమో రక్తంతో వ్రాసేస్తాడు ( అది కోడి రక్తమో? వాడి రక్తమో? వేరే సంగతి) ఒకడేమో కత్తితో పొడిచి, మరొకడేమో యాసిడ్ పోసి చంపేస్తాడు. ఏమిటిది? అని అడిగితే నాకు దక్కనిది ఇంకెవ్వరకూ దక్కకూడదు. ప్రేమంటే ఇదే అంటాడు.

**'ప్రేమికుల రోజు' (వాలెంటైన్స్ డే) ఇదొకటి.ఆ రోజు 'నా హృదయంలో నీకుతప్ప ఇంకెవ్వరికీ స్థానం లేదు' అంటూ వ్రాసి 'అందరికీ' పంచుతాడు. అదేంటి అంటే? ప్రేమ అంటే అంతే అంటాడు.**

ఇక తల్లి ప్రేమ! ఆ ప్రేమను వర్ణించడం ఎవ్వరి తరమూకాదు. కాని వారి అక్రమమైన జీవితాలను కొనసాగించడానికి కన్న బిడ్డలను సహితం కర్కషంగా చంపేసే తల్లులెందరో? ఆ తల్లి ప్రేమకూడా కలుషితమవుతుంది.

**ఇక అందరికీ తల్లి 'మదర్ థెరీసా' ఆమె ప్రేమ స్వచ్ఛమైనది. ఎవ్వరూ కాదనలేనిది. కాని, పరిపూర్ణమైనది కాదు. ఆ ప్రేమ కొందరికే పరిమితం, కొంత కాలమే పరిమితం. శారీరికమైన స్వస్థత చేకూర్చ కలిగింది గాని, పాప రోగం నుండి మనిషిని విడిపించ లేకపోయింది.**

## ఇంతకీ, నిజమైన ప్రేమ అంటే ఏమిటి?

ఈ లోకంలో 'నిజమైన ప్రేమకు' అర్థాన్ని, నిర్వచనాన్ని చెప్పిన వాడు ఒకే ఒక్కడు.

**ప్రేమకు అర్థం, నిర్వచనం?**

నిజమైన ప్రేమకు అర్థం, నిర్వచనం 'నీ ప్రియ రక్షకుడే'. ఆయన ప్రేమాస్వరూపి ( ఆయనే ప్రేమమయై వున్నాడు)

1 యోహాను 4:8,16

**ఆయన ప్రేమతత్వం:**

శత్రువులను కూడా ప్రేమించు. (మత్తయి 5:44) మాటలకే పరిమితం కాదు. చేసి చూపించారు కూడా. మనము శత్రువులమై వున్నప్పుడు మన కోసం తన ప్రాణమును పెట్టారు. (రోమా 5:10)

**ఆ ప్రేమ యొక్క లక్షణాలు:**

ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును. ప్రేమ మత్సరపడదు; ప్రేమ డంబముగా ప్రవర్తింపదు; అది ఉప్పొంగదు;
అమర్యాదగా నడువదు; స్వప్రయో జనమును విచారించుకొనదు; త్వరగా కోపపడదు; అపకారమును మనస్సులో ఉంచుకొనదు.
దుర్నీతివిషయమై సంతోషపడక సత్యమునందు సంతోషించును.
అన్ని టికి తాళుకొనును, అన్నిటిని నమ్మును; అన్నిటిని నిరీక్షించును; అన్నిటిని ఓర్చును.ప్రేమ శాశ్వతకాలముండును.

1 కొరింది 13:4-8

**నీ దృష్టిలో ప్రేమంటే ఏమిటో నాకు తెలియదుగాని, ఒక్కటి మాత్రం ఖచ్చితంగా తెలుసు. ఏదో ఒకటి ఆశించే ప్రేమిస్తావని. కనీసం తలిదండ్రుల ప్రేమలో కూడా అంతర్గతంగా ఒక ఆశ వుంటుంది. పిల్లలు పెద్దవారై వారిని కూడా ప్రేమగా చూస్తారని.**

**కాని, ఆయన ప్రేమ బదులాశించనిది.**
**అది అమరం, అతిమధురం,అపురూపం. అవధులులేనిది అద్వితీయమైనది. సింహాసనము నుండి సిలువకు దిగివచ్చినది.**
**మరణము కంటే బలీయమైనది. సజీవ మైనది, శాశ్వతమైనది.**

**అట్టి ప్రేమను అనుభవిస్తున్న నీవు ఆ ప్రేమకు మాదిరిగా జీవించాలి.**

**ఆరీతిగా మన జీవితాలను**
**సిద్ధ పరచుకుందాం!**
**మాదిరికరమైన జీవితాన్ని జీవిద్దాం!**

**అట్టి కృప, ధన్యత**
**దేవుడు మనకు అనుగ్రహించునుగాక!**
**ఆమెన్! ఆమెన్! ఆమెన్**